## క్లుప్తంగా

### కౌన్సెలింగ్ బహిష్కరణపై ఫ్యాప్టో నోటీసు


ఎంఈఓకు నోటీసు అందజేస్తున్న ఫ్యాప్టో నాయకులు

పెద్దాపురం: రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయ సంఘాలకు సంబంధం లేకుండా నిర్వహిస్తున్న తాత్కాలిక పని సర్దుబాటు కౌన్సెలింగ్‌ను బహిష్కరిస్తున్నామని ఫ్యాప్టో ప్రతినిధి బృందం సోమవారం మండల విద్యా శాఖకు నోటీసు అందజేసింది. ఫ్యాప్టో నాయకులు జాన్‌కెనడీ, కరుణాకర్, నిత్యానందం మాట్లాడుతూ ఉపాధ్యాయుల పని సర్దుబాటు ప్రక్రియ ప్రభుత్వం ఏకపక్షంగా వ్యవహరిస్తోందన్నారు. రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా ఈ ప్రక్రియను పూర్తిగా బహిష్కరిస్తున్నామన్నారు. అనంతరం ఎంఈఓకు నోటీసును అందజేశారు.

### సమాన హక్కులతోనే మహిళాభివృద్ధి


వివిధ జిల్లాల అధికారుల శిక్షణలో మాట్లాడుతున్న శ్రీదేవి

సామర్లకోట: మహిళలకు సమానమైన హక్కులు కల్పిస్తూ, వారిని గౌరవించడం ద్వారానే అభివృద్ధి సాధ్యమని సీనియర్ ఫ్యాకల్టీ శ్రీదేవి అన్నారు. స్థానిక టీటీడీసీలో శ్రీకాకుళం నుంచి ఏలూరు వరకున్న 11 జిల్లాల్లోని ఉన్నతాధికారులకు నిర్వహించిన శిక్షణను సోమవారం ఆమె ప్రారంభించారు. కేంద్ర ప్రభుత్వం ప్రతి రాష్ట్రంలోను సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు అమలు చేయాలని ఆదేశాలు జారీ చేసిందన్నారు. మహిళా స్నేహ పూర్వక గ్రామం అనే అంశంపై మూడు రోజుల పాటు శిక్షణ ఇస్తారన్నారు. మహిళలు, బాలికలపై నేరాల నియంత్రణ, అన్ని ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో మహిళలకు భద్రత ఉండేలా అధికారులు కృషి చేయాలన్నారు. ఫ్యాకల్టీలు వి ప్రసాద్, కేఎస్ఆర్ నిహారిక, పద్మజ, చక్రపాణి రావు, బి.ఆంజనేయులు, బి.వెంకటేశ్వర్లు శిక్షణ నిర్వహించారు.

### ఉచిత మధుమేహ పరీక్షలు


పరీక్షలు చేస్తున్న లయన్స్ ప్రతినిధులు

సామర్లకోట: లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక బలుసులపేటలో ఉచిత మధుమేహ పరీక్షలు నిర్వహించారు. శిబిరాన్ని వార్డు కౌన్సిలర్ నేతల హరిబాబు ప్రారంభించారు. 89 మందికి పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేసినట్టు డాక్టరు కర్రి ఆదినారాయణరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు ఎస్ఆర్‌వై ప్రసాద్, కోశాధికారి బడుగు బాబీ, ప్రతినిధులు మేకా శ్రీనివాసరావు, గుండు శంకరరావు, గిడుతూరి శ్రీనివాసరావు సేవలందించారు.

### గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య

సామర్లకోట: ఓ గుర్తు తెలియని వ్యక్తి సోమవారం ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఇది. రైల్వే పోలీసుల కథనం ప్రకారం, రామేశ్వరం నుంచి భువనేశ్వర్ వెళుతున్న రైలుకు పిఠాపురం–సామర్లకోట మధ్యన ట్రాక్‌పై అడ్డుగా వెళ్లి గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. రైలు డ్రైవరు సమాచారం మేరకు ఆర్పీఎఫ్ ఎస్సై ఎస్ రవికుమార్ కేసు నమోదు చేశారు.

# అన్నార్తుల అక్షయ పాత్ర

- సేవే లక్ష్యంగా ముందుకు సాగుతున్న సీజీఎం
- సరిహద్దులు దాటి ఆకలి తీరుస్తున్న బృందం
- ఛత్తీస్‌గఢ్, ఒడిశాతో పాటు, తమిళనాడులోనూ సేవలు


తిరుపతిలో ఇంటి వద్దే భోజనం సిద్ధం చేస్తున్న బృందం (ఫైల్)


ఏజెన్సీ ప్రాంతంలో వైద్య సేవలందిస్తూ..

పెద్దాపురం: పేదల ఆకలిని గుర్తించి, ఎంత దూరంలో ఉన్నా వారిని ఆదుకోవాలన్నదే ఆ బృందం ప్రధాన లక్ష్యం. క్షుద్బాధతో ఉన్న వారికి భోజనం పెట్టాలన్న సత్సంకల్పంతో పాటు, మనకున్న దానిలో, మనవంతు సాయంగా, చేయీచేయీ కలిపి వేలాది మంది అనాథలకు భోజనం, వస్త్రాలు, వైద్య సేవలందిస్తూ అందరి మన్ననలు పొందుతోంది పెద్దాపురం మండలం తిరుపతి క్రిష్టియన్ గాస్పల్ మినిస్ట్రీస్ (సీజీఎం) స్వచ్ఛంద సేవా సంస్థ. కరోనా రెండో తీవ్రతలో అన్నార్తులు, బాటసారులు ఎదుర్కొంటున్న ఆకలి కష్టాన్ని ఆ సంస్థ గుర్తించింది. కర్ఫ్యూ వేళలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించింది సీజీఎం స్వచ్ఛంద సంస్థ. ప్రతి నెలా గిరిజన ప్రాంతాల్లోనే పేదలకు సుమారు 60 మంది సభ్యుల బృందం సొంత ఖర్చులతో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోంది. సీజీఎం సంస్థ వ్యవస్థాపకుడు నంగిన శామ్యూల్ సుదీప్ ఆధ్వర్యంలో ఛత్తీస్‌గఢ్, ఒడిశా, మహారాష్ట్ర వంటి అనేక ప్రాంతాల్లో అన్నార్తులకు భోజనం, వైద్యం, వస్త్రాలందిస్తూ, ప్రతి నెలా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

**అందరూ కష్టజీవులే..**

సంస్థలో బృంద సభ్యులుగా ఉన్న ప్రతి ఒక్కరూ కష్టజీవులే. దైవ సేవకులు కొందరు, వంట పనిచేసేవారు, రోజూకూలీకి వెళ్లేవారు.. వ్యవసాయాధారంగా జీవించే రైతు, కొబ్బరి బొండాల వ్యాపారులు ఇలా అన్ని రంగాల్లో కష్టపడి జీవించే సుమారు 60 మందితో ప్రారంభమైంది ఈ సంస్థ. ఇప్పుడు 120 మందితో కలిసి ఇతర రాష్ట్రాల్లోనూ సేవా కార్యక్రమాల్లో చురుగ్గా సేవలందిస్తోంది.

**గిరిజన ప్రాంతాల్లో..**

కాగా 2012లో కేవలం 14 మంది సభ్యులతో ప్రారంభమైన ఈ సంస్థలో ప్రస్తుతానికి 120 మంది సభ్యులుగా చేరారు. ప్రతి ఒక్కరూ తమ కష్టార్జితంలో ప్రతి నెలా కొంత సొమ్మును సేవా కార్యక్రమానికి ఉపయోగిస్తున్నారు. ఇప్పటివరకు తెలంగాణ, తమిళనాడు, ఛత్తీస్‌గఢ్, ఒడిశా, సరిహద్దుల్లోని తండాలతో కలిసి సుమారు 1800 గ్రామాల్లో పేదలకు దుస్తులు, వైద్య సదుపాయం, భోజన వసతి ఏర్పాటు చేశారు.

**కోవిడ్ కష్టాల్లోనూ..**

సంస్థ తరఫున అన్నార్తుల ఆకలి తీరుస్తూ, కోవిడ్ సమయంలోనూ సీజీఎం ఉన్నతమైన సేవలందించింది. సీజీఎం వ్యవస్థాపకుడు శామ్యూల్ సుదీప్ స్వగృహంలోనే యువతీ, యువకులు, సంస్థకు చెందిన కుక్ కలిసి ప్రతి రోజూ వేకువజామున వంటలు ప్రారంభించేవారు. ఉదయం 9.30 కల్లా భోజనాలను ప్యాకింగ్ చేసి, వ్యాన్‌లో 11 గంటలకు ముందుగా అనుకున్న ప్రదేశానికి వెళ్లేవారు. సరిగ్గా 12 గంటలకు కర్ఫ్యూ సమయం మొదలు కాగానే, ఆకలితో అలమటిస్తూ ఉండే వాళ్లకు ప్యాకెట్లను అందజేశారు. ప్రతి ఒక్కరూ మాస్క్, చేతికి గ్లౌజ్, శానిటైజర్‌ను వాడుతూ, భోజన ప్యాకెట్లను పంపిణీ చేసి అందరి మన్ననలు అందుకుంది సీజీఎం సంస్థ.

**సంతృప్తి కలుగుతుంది**



మాకు ఉన్నంతలో ఎదుట వారికి సేవ చేయడంలో ఉన్న సంతృప్తి వర్ణనాతీతం. ప్రతి నెలా గిరిజన గ్రామాల్లో సేవ చేస్తూ, కర్ఫ్యూ వేళల్లో పట్టెడన్నం దొరకని వాళ్ల ఆకలి తీరుస్తున్నప్పుడు వారి కళ్లలలో ఆనందాన్ని నేరుగా చూశాం. సమాజ సేవే లక్ష్యంగా సీజీఎం స్థాపించాం. దానికనుగుణంగా మా బృంద సభ్యుల సహకారంతో సేవలు చేస్తున్నాం. మరి కొంతమంది స్ఫూర్తిగా తీసుకుని అన్నార్తులను ఆదుకునేందుకు ముందుకు వస్తారని ఆశిస్తున్నాం.

– నంగిన శామ్యూల్ సుదీప్, సీజీఎం వ్యవస్థాపకుడు, తిరుపతి, పెద్దాపురం మండలం

**సేవలో భాగస్వామ్యం**



అన్నార్తులు, నిరుపేదలు, బాటసారులు ఎదుర్కొంటున్న కష్టాలను నేరుగా చూశాం. అటువంటి వాళ్ల కోసం మా సంస్థ వ్యవస్థాపకుడు సుదీప్ చేస్తున్న సేవలో భాగస్వామ్యం పొందడం చాలా ఆనందంగా ఉంది. పెళ్లిళ్ల సీజన్‌లో నాకు మంచి గిరాకీ ఉంటుంది. అయినా ఈ సేవా కార్యక్రమంలో భాగస్వామ్యం కోసమే ఆర్డర్లు మాని, వాళ్లకి వంట చేసి అందించడంలో ఉన్న తృప్తి మాటల్లో చెప్పలేను.

– పోలవరపు పైడిరాజు, కేటరింగ్ కుక్, మంగుతుర్తి, పిఠాపురం మండలం

### కుంభ వృష్టి


సామర్లకోట స్టేషన్ సెంటర్‌లో నిలిచిపోయిన వర్షపు నీరు

సామర్లకోట: కేవలం పది నిమిషాల వర్షానికే స్థానిక స్టేషన్ సెంటర్‌లో రోడ్లు చెరువులుగా మారాయి. సోమవారం ఉదయం కురిసిన కుంభ వృష్టికి జనం బెంబేలెత్తారు. స్థానిక స్టేషన్ సెంటర్‌లో రోడ్డు చెరువుగా మారిపోయింది. పల్లపు ప్రాంతాలు జలమయం అయ్యాయి. వర్షపు నీరు డ్రైన్లలోకి వెళ్లడానికి ఆటంకాలు ఏర్పడడంతో, రోడ్లు చెరువులను తలపిస్తున్నాయని స్థానికులు చెబుతున్నారు.

### తోలు బొమ్మలాట కళాకారులకు సత్కారం

కాకినాడ సిటీ: ప్రసిద్ధి చెందిన తోలు బొమ్మలాట కళాకారులైన తోట బాలకృష్ణ దంపతులను కలెక్టర్ షాన్ మోహన్ సోమవారం సత్కరించారు. తోలు బొమ్మలాటపై విద్యార్థులకు అవగాహన కల్పించడంతో పాటు, ఉచితంగా శిక్షణ ఇస్తున్న కాకినాడ రూరల్ జమున నగర్‌కు చెందిన తోట బాలకృష్ణ చేస్తున్న కృషిని గుర్తించి, ఐక్యరాజ్య సమితి అంతర్జాతీయ శాంతి మండలి (యునైటెడ్ నేషన్స్ ఇంటర్నేషనల్ పీస్ కౌన్సిల్) పాండిచ్చేరిలో ఇటీవల కళారత్న అవార్డు ప్రదానం చేసింది. ప్రాచీన కాలం నుంచి అత్యంత ప్రజాదరణ పొంది, ప్రస్తుతం అంతరించి పోతున్న తోలు బొమ్మలాటను ప్రజలకు అందుబాటులో ఉంచాలనే సదుద్దేశంతో ప్రభుత్వం ద్వారా దీనిపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తూ, బాలకృష్ణ దంపతులు ఉచిత శిక్షణ ఇస్తున్నారు. వీరు తోలు బొమ్మలాట కళలో అత్యంత ప్రావీణ్యం సంపాదించారని కలెక్టర్ ప్రశంసించారు. ఈ సందర్భంగా ఐక్యరాజ్య సమితి ప్రదానం చేసిన జ్ఞాపిక, ప్రశంసాపత్రాన్ని బాలకృష్ణ దంపతులకు కలెక్టర్ షాన్ మోహన్ అందజేసి అభినందించారు.

### బ్రాహ్మణుల సమస్యల పరిష్కారానికి కృషి

బోట్‌క్లబ్: బ్రాహ్మణుల ఐక్యతను చాటుకోవడం ద్వారా అనేక సమస్యల పరిష్కారానికి కృషి చేయడానికి అవకాశం ఉంటుందని బ్రాహ్మణ అభివృద్ధి సమాఖ్య సేవా సంఘం అధ్యక్షుడు పసుమర్తి సత్యనారాయణ మూర్తి అన్నారు. సంఘ నూతన కార్యాలయాన్ని స్థానిక అశోక్‌నగర్‌లో సోమ వారం ప్రారంభించారు. అన్ని కార్యక్రమాలలో బ్రాహ్మణుల సేవలు కోరుకుంటారని, వారి సమస్యలపై ఎవరూ స్పందించరని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పేద బ్రాహ్మణులకు నెలసరి స్వయం పాక కిరాణా సామాన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు దివి శ్రీనివాస్ ఆచార్యులు, గరిమెళ్ల లక్ష్మీనారాయణ శర్మ, తనికెళ్ల వెంకటరామయ్య శర్మ పాల్గొన్నారు.

### ఆర్డీఓ కార్యాలయ ఏఓగా త్రినాథరావు

కాకినాడ సిటీ: కాకినాడ రెవెన్యూ డివిజనల్ కార్యాలయ పరిపాలనాధికారిగా పితాని త్రినాథరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది, పలువురు అధికారులు ఆయనకు అభినందనలు తెలిపారు.

### జానపద కళాకారుల జిల్లా కార్యవర్గం ఎన్నిక

కాకినాడ సిటీ: జానపద కళాకారుల సంక్షేమ సంఘం జిల్లా కార్యవర్గ ఎన్నిక సోమవారం కాకినాడ సుందరయ్య భవన్‌లో నిర్వహించారు. కమిటీ అధ్యక్షుడిగా వీర్నాల కృష్ణ, ప్రధాన కార్యదర్శిగా తోట పవన్‌కుమార్, జిల్లా కోశాధికారిగా వేర్నాల ప్రకాష్, గౌరవాధ్యక్షుడిగా పుల్లారావు, సలహాదారులుగా వెంకటేశ్వరరావు, ఏడుకొండలు, తోట బాలకృష్ణ తదితరులు ఎన్నికయ్యారు. ఈ నెల 22న ప్రపంచ జానపద దినోత్సవం సందర్భంగా జిల్లాలో ఉన్న 30కి పైగా కళారూపాలతో కాకినాడ నగరంలో కలెక్టరేట్ నుంచి ఉదయం 10 గంటలకు కలెక్టర్ అధ్యక్షతన కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా తోలు బొమ్మలాట సీనియర్ కళాకారుడు తోట బాలకృష్ణ దంపతులను సత్కరించారు.

## క్రీడలతో శారీరక, మానసికోల్లాసం


కబడ్డీ మీట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాజప్ప


కబడ్డీ మ్యాచ్‌లో తలపడుతున్న క్రీడాకారులు

కబడ్డీ పోటీలు ప్రారంభించిన ఎమ్మెల్యే రాజప్ప

పెద్దాపురం: విద్యార్థుల శారీరక, మానసికోల్లాసానికి క్రీడలు దోహదపడతాయని ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప అన్నారు, స్థానిక జవహర్ నవోదయ విద్యాలయలో సోమవారం రీజనల్ కబడ్డీ పోటీలను ఆయన ప్రారంభించారు. సభకు విద్యాలయ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ రామకృష్ణయ్య అధ్యక్షత వహించారు. ఎమ్మెల్యే చినరాజప్ప మాట్లాడుతూ ప్రతి విద్యార్థి క్రీడాసక్తిని పెంపొందించుకోవాలన్నారు. మున్సిపల్ మాజీ చైర్మన్ రాజా సూరిబాబు రాజు మాట్లాడుతూ విద్యార్థులు క్రీడలకు సమయాన్ని కేటాయించి, మంచి ప్రతిభను కనబర్చాలన్నారు. తొలుత ఎమ్మెల్యే క్రీడా జ్యోతిని వెలిగించి కబడ్డీ మీట్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో శ్రీకాకుళం జిల్లా జేఎన్‌వీ ప్రిన్సిపాల్ డి.పరుశురామయ్య, పీఈటీ సత్యనారాయణ, వి.జగన్మోహనరావు, కె.సుధీర్‌కుమార్, పీజీటీ ఇంగ్లిష్ సనపల సత్యనారాయణ, ఆయా జేఎన్‌వీల నుంచి సుమారు 550 మంది క్రీడాకారులు పాల్గొన్నారు.

## అర్జీల సత్వర పరిష్కారానికి గ్రీవెన్స్


అర్జీ స్వీకరిస్తున్న డీటీ భానుకుమార్

పెద్దాపురం: ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికై ప్రతి వారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) నిర్వహిస్తున్నట్టు ఆర్డీఓ కార్యాలయ డీటీ భానుకుమార్ అన్నారు. సోమవారం నిర్వహించే గ్రీవెన్స్ కార్యక్రమంలో భాగంగా డివిజన్‌లోని వివిధ మండలాల నుంచి 12 అర్జీలు అందినట్టు చెప్పారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ డివిజన్ స్థాయిలో వచ్చే ప్రతి అర్జీని ఆయా శాఖకు బదిలీ చేసి, సమస్యను పరిష్కరిందేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టామన్నారు. డివిజన్ స్థాయిలో అన్ని శాఖల అధికారులు స్పందనకు హాజరయ్యేలా చర్యలు చేపట్టామన్నారు. ప్రతి అర్జీని పరిష్కరించాల్సిన బాధ్యత సంబంధిత శాఖాధికారిపై ఉంటుందన్నారు. ఈ వారం ఆరు అంశాలపై ఫిర్యాదులు అందాయన్నారు. వాటిని సత్వరమే పరిష్కరించాలని సంబంధిత శాఖాధికారులకు ఆదేశించినట్టు తెలిపారు. కార్యక్రమంలో డీఎల్పీఓ బాలామణి, సీడీపీఓ ఉష, హౌసింగ్ అధికారి రవిశంకర్, తదితర అధికారులు పాల్గొన్నారు.

**అర్జీలు నిల్**

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం పీజీఆర్ఎస్ (గ్రీవెన్స్) నిర్వహించారు. ఎంపీడీఓ ఎం.ఉషారాణి, కార్యాలయ పరిపాలనాధికారి సత్యనారాయణమూర్తి పాల్గొన్నారు. ఎటువంటి అర్జీల అందలేదని ఎంపీడీఓ తెలిపారు. వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## గ్రామాభివృద్ధిలో సర్పంచుల పాత్ర కీలకం


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ ఉషారాణి


కొత్తపల్లిలో శిక్షణ తరగతులకు హాజరైన సర్పంచులు, కార్యదర్శులు


శిక్షణలో మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్యామ్‌సుందర్

పెద్దాపురం: సర్పంచులు బాధ్యతాయుత విధులతో, క్రమశిక్షణతో మెలిగినప్పుడే గ్రామాలు మరింత అభివృద్ధి సాధిస్తాయని ఎంపీడీఓ ఎం.ఉషారాణి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నుంచి మూడు రోజుల పాటు నిర్వహించే సర్పంచుల శిక్షణా తరగతులను ఎంపీపీ పెంకే సత్యవతితో కలిసి ప్రారంభించారు. ఈఓపీఆర్డీ సత్యనారాయణ అధ్యక్షత వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో యువత డ్రగ్స్ బారిన పడి జీవితాలను నాశనం చేసుకుంటోందన్నారు. యువతను క్రమశిక్షణలో పెట్టాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులపై ఉందన్నారు. అనంతరం గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ, వీధిలైట్ల నిర్వహణ, పంచాయతీ పాలన తీరు తదితర అంశాలపై సర్పంచ్‌లకు శిక్షణ ఇచ్చారు. తొలుత డ్రగ్ రహిత గ్రామాల నిర్మాణాలపై ప్రజాప్రతినిధులతో ఎంపీడీఓ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో గుడివాడ, కాండ్రకోట, కొండపల్లి, పులిమేరు, చదలాడ, కట్టమూరు. ఆర్‌బీ పట్నం తదితర గ్రామాల సర్పంచ్‌లు పాల్గొన్నారు.

**సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ**

కొత్తపల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు సోమవారం శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ శిక్షణను ఎంపీడీఓ వెంకటనారాయణ ప్రారంభించారు. పంచాయతీల విధులు, 15వ ఆర్థిక సంఘం నిధులు, అభివృద్ధి ప్రణాళిక, చెత్త నుంచి సంపద కేంద్రల నిర్వహణపై సామర్లకోట శిక్షణా కేంద్రం ప్రిన్సిపాల్ వేణుగోపాల్ శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణా తరగతులు మరో రెండు రోజుల పాటు కొనసాగుతాయని ఎంపీడీఓ తెలిపారు.

**సమస్యలు లేని గ్రామాలే లక్ష్యం**

సామర్లకోట: మండలంలో సమస్యలు లేని గ్రామాలను తయారు చేసేందుకు సమగ్ర ప్రణాళికలు రూపొందించుకోవాలని ఎంపీడీఓ ఎస్‌డీ శ్యామ్ సుందర్ అన్నారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సర్పంచ్, పంచాయతీ కార్యదర్శులకు నిర్వహించిన శిక్షణను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో పారిశుధ్య సమస్యను పరిష్కరించడంతో పాటు, స్వచ్ఛమైన తాగునీరు, విద్యుద్దీపాలను ఏర్పాటు చేయవలసిన బాధ్యత పంచాయతీలపై ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి మంజూరైన జల్‌జీవన్ మిషన్ సక్రమంగా అమలు జరిగే విధంగా చూడాలన్నారు. ప్రతి ఇంటికీ కుళాయి కనెక్షన్ అందజేయాలన్నారు. ఎంపీడీఓ కోర్సు డైరెక్టరుగా, ఈఓపీఆర్డీ అసిస్టెంట్ కోర్సు డైరెక్టర్‌గా వ్యవహరించారు. మాస్టర్ ట్రైనర్లు వై శ్రీహరి, నాగ ఫణిబాబు, తోట సత్యనారాయణ శిక్షణ ఇచ్చారు. తొలుత అసాంఘిక కార్యక్రమాల నిర్మూలనకు సిద్ధంగా ఉంటామని ఎంపీడీఓ ప్రతిజ్ఞ చేయించారు. వీకే రాయపురం సర్పంచ్ మోర్త పూర్ణిమ మృతికి రెండు నిమిషాలు మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు.

# బెంగాలీ నాట్లు.. దిగుబడికి మెట్లు

- రైతులకు తగ్గుతున్న పెట్టుబడి ఖర్చు
- ఆసక్తి చూపుతున్న అన్నదాతలు
- నియోజకవర్గంలో 12 వేల హెక్టార్లలో వరిసాగు


ఇసుకపల్లిలో నాట్లు వేస్తున్న బెంగాలీ కూలీలు

కొత్తపల్లి: నియోజకవర్గంలో ఖరీఫ్ వరినాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. రైతులను కూలీల కొరత వేధిస్తోంది. సాంప్రదాయ విధానంలో నాట్లు వేస్తే పెట్టుబడి ఖర్చు కూడా భారీగా పెరుగుతోంది. సాగులో పెట్టుబడి తగ్గించుకునేందుకు పిఠాపురం నియోజకవర్గంలో రైతులు బెంగాలీ కూలీలతో నాట్లు వేయించేందుకు ఆసక్తి చూపిస్తున్నారు.

బెంగాలీ తరహాలో నాట్లు వేస్తే తెగుళ్ల బెడద తక్కువగా ఉంటుందని రైతులకు వ్యవసాయశాఖ అధికారులు సూచిస్తున్నారు. దీంతో రైతులు బెంగాలీ కూలీలను తీసుకొస్తున్నారు. ఇప్పటికే జట్లుగా వచ్చిన బెంగాలీ కూలీలు నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో స్థావరాలు ఏర్పాటు చేసుకుని కాంట్రాక్టు ప్రాతిపదికన రైతులతో మాట్లాడుకుంటున్నారు. మండలంలో ఇప్పటికే 60 శాతం బెంగాలీ కూలీలు నాట్లు వేశారు.

**నియోజకవర్గంలో సాగు వివరాలు**

నియోజకవర్గంలోని కొత్తపల్లి, పిఠాపురం, గొల్లప్రోలు మండలాల్లో సుమారు 12 వేల హెక్టార్లలో ఈ ఏడాది రైతులు వరి సాగు చేస్తున్నారు. కొత్తపల్లి మండలంలో సుమరు 6150 మంది రైతులు 10154 ఎకరాల్లో ఖరీఫ్ వరి సాగు చేస్తున్నారు.

**లేత నారుతోనూ నాట్లు**

రైతులు గతంలో ఎకరానికి 25 కిలోల విత్తనాలు నారు కోసం వినియోగించేవారు. బెంగాలీ కూలీల రాకతో ఎకరానికి సుమారు 15 కిలోలు విత్తనాలు మాత్రమే వినియోగిస్తున్నారు. బెంగాలీ కూలీలు లేత నారుతోనే నాట్లు వేయగలరు. వీరు వేసిన నాట్లు నాలుగైదు రోజుల్లో మూనలు మారతాయి. స్థానిక కూలీలు వేసిన నాట్లు మూనలు తిరగాలంటే పది రోజులు పడుతుంది. నాట్లకు స్థానిక కూలీలు ఆరుగురు అవసరమైతే బెంగాలీలు నలుగురు సరిపోతారు. వీరు ఎకరానికి 15 నుంచి 20 పోగుల నారు వాడితే స్థానికులు 45 పోగులకుపైనే వినియోగిస్తారు. స్థానిక కూలీలతో పోలిస్తే బెంగాలీ నాట్లు వల్ల రైతులకు ఖర్చులు బాగా తగ్గుతాయి. ఈ విధానంతో రైతులు అధిక దిగుబడులు సాధించే అవకాశం ఉంది.

**దిగుబడి పెరిగింది**



నేను సుమారు 30 ఎకరాలు సాగు చేస్తున్నాను. మూడేళ్లుగా బెంగాలీ కూలీలతో నాట్లు వేయిస్తున్నాను. వారు నేర్పుతో నాట్లు వేస్తారు. ఫలితంగా ఖర్చు తగ్గింది. చీడ పీడల బెడద తగ్గింది. దిగుబడి గణనీయంగా పెరిగింది. ముఖ్యంగా కూలీల కొరత సమస్య పరిష్కారమైంది.

వనపర్తి సూర్యనారాయణ, రైతు, ఇసుకపల్లి

**ఖర్చు తక్కువ**



బెంగాలీ నాట్లు విధానం చాలా బాగుంది. ఖర్చు ఆదిలోనే మూడొంతులకు పైగా తగ్గిపోయింది. నేను సుమారు 40 ఎకరాలు సాగు చేస్తున్నాను. బెంగాలీ విధానంలో నారు కూడా బాగా తక్కువగా అవసరమవుతుంది. దిగుబడి బాగా వస్తుంది.

కునిశెట్టి అప్పారావు, రైతు, ఇసుకపల్లి

**92 శాతం నాట్లు పూర్తి**



మండలంలో ఇప్పటివరకూ 92 శాతం నాట్లు పూర్తయ్యాయి. 60 శాతం మంది రైతులు బెంగాలీ కూలీలతో నాట్లు వేయించారు. బెంగాలీ నాట్ల వల్ల పెట్టుబడి ఖర్చులు తగ్గడంతో పాటు పురుగు మందుల వాడకమూ తగ్గుతుంది. దీంతో ఎక్కువ మంది రైతులు బెంగాలీ కూలీల వైపు మొగ్గు చూపుతున్నారు. రైతులకు పంటల సాగుపై సూచనలు, సలహాలు ఇస్తున్నాం.

జోగిరాజు, మండల వ్యవసాయాధికారి, కొత్తపల్లి

## ఈ-క్రాప్, సీసీఆర్సీ ప్రక్రియ వేగవంతం

అధికారులకు కలెక్టర్ షాన్ మోహన్ ఆదేశం

కాకినాడ సిటీ: జిల్లాలో సాగు ఉత్పత్తిని పెంచడంతో పాటు ఈ–క్రాప్ బుకింగ్, సీసీఆర్సీ కార్డుల పంపిణీ ప్రక్రియ వేగవంతం చేయాలని కలెక్టర్ షాన్ మోహన్ సగిలి అధికారులను ఆదేశించారు. సోమవారం సాయంత్రం కలెక్టరేట్‌లో వ్యవసాయ అనుబంధ రంగాల క్షేత్రస్థాయి కార్యకలాపాలపై వ్యవసాయ, పశు సంవర్ధక, ఉద్యానవన, మత్స్య, మైక్రో ఇరిగేషన్, లీడ్ బ్యాంక్ శాఖల అధికారులతో కలిసి, తహసీల్దార్లు, వ్యవసాయ విస్తరణ అధికారులు, మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో సాగు ఉత్పత్తి పెంచడానికి అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. మండలాల వారీ రైతుల ఏఏ వరి రకాలు సాగు చేసుకున్నారో వివరాలు సిద్ధం చేయాలని ఆదేశించారు. సాగుదారుడికి రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందేలా ఈ–క్రాప్ బుకింగ్ సక్రమంగా నిర్వహించాలన్నారు. కౌలు రైతులకు గుర్తింపు పత్రాల ప్రక్రియ వేగవంతం చేసి రుణాలు మంజూరుపై దృష్టి పెట్టాలన్నారు. అర్హులైన కౌలు రైతులకు తప్పనిసరిగా సీసీఆర్సీ కార్డు అందేలా రెవెన్యూ, వ్యవసాయ అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. డీఆర్వో తిప్పేనాయక్, జేడీఏ ఎన్ విజయకుమార్, మత్స్యశాఖ అధికారి కె కరుణాకర్, డ్వామా పీడీ ఎ వెంకటలక్ష్మి, జిల్లా ఉద్యానవన అధికారి ఎం మల్లికార్జునరావు, ఏపీఎంఐపీ పీడీ జీవీవీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

**మాదక ద్రవ్యాల వ్యతిరేక పోస్టర్ విడుదల**

జిల్లా మహిళాభివృద్ధి, శిశుసంక్షేమ సాధికారిత అధికారి కె ప్రవీణ ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాల వ్యతిరేకంగా మత్తులో జగత్తు జీవితం చిత్తు అనే అంశంపై పోస్టర్‌ను కలెక్టర్ విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ యువతను చెడు మార్గాల్లో మళ్లించడంలో మాదక ద్రవ్యాల పాత్ర తీవ్రమైందన్నారు. విద్యార్థులు, యువకులు చదువుకు దూరమై, దుర్భర జీవితం గడుపుతున్నారన్నారు. తీవ్ర ఆరోగ్య సమ్యలు ఎదురవుతాయన్నారు. మాదక ద్రవ్యాలు అమ్మిన వారిపై, తీసుకున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లా బాలల పరిరక్షణ అధికారి సీహెచ్ వెంకటరావు, చైల్డ్ హెల్ప్‌లైన్ కో–ఆర్డినేటర్ బి శ్రీనివాసరావు, సీడీపీఓలు పాల్గొన్నారు.


అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ షాన్ మోహన్